# అందరి సలహాలు, సూచనల మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి పనులు

- 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు ఇతర ప్రముఖుల సలహాలు సూచనలు మేరకు చేపడుతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి, ఈ నెల 19 వ తేదీన శృంగేరి పీఠాధిపతి విదు శేఖర భారతి స్వామి వారి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై వేములవాడలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, వీటీఏడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి గితే తదితరులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని,మొదటి దశలో రూ. 76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ. 35 కోట్లతో అన్నప్రసాద వితరణ శాల, రూ. 47 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామనిఅన్నారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి విస్తరణ



చేస్తామని,ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని,ఆలయ పనులపై ప్రతి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీకిస్తున్నామని అన్నారు. ఈ నెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామి రానున్నారని,ఈ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామనిఅన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలో ఎల్ ఈ డీ స్క్రీన్/ ప్రచారథంలో దర్శనం కల్పిస్తామని అన్నారు.

# ప్రజల సమస్యల పట్ల జాగృతి పోరాటం

- కేసీఆర్ ఫొటో పెట్టుకొని నేను యాత్ర చేయడం నైతికంగా సరికాదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 13 వరకు 33 జిల్లాల్లో యాత్ర

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యల పట్ల జాగృతి పోరాటం చేస్తూనే ఉందని, నిన్న కూడా గ్రూప్ –1 అభ్యర్థుల కోసం పోరాటం చేశామని, ఎన్ని సమస్యలను అడ్రస్ చేసిన కూడా మళ్లీ కొత్త సమస్యలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో వస్తూనే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని ఎన్నో సమస్యలు పట్టి పీడిస్తున్నాయని, గ్రామాల్లో యూరియా సమస్యతో పాటు పట్టణాల్లోనూ అనేకానేక సమస్యలు ఉన్నాయని,ఈ సమస్యల పరిష్కారాన్ని పక్కనపెట్టి ప్రతిపక్షాలనే ఈ ప్రభుత్వం తిడుతోందని అన్నారు.

కనీసం జాతీయ పార్టీ అయిన బీజేపీ అయిన ఏమైనా చేస్తుందా అంటే అది లేదని, బీజేపీ కి 8 ఎంపీలు, 8 ఎమ్మెల్యేలను ఇస్తే తెలంగాణకు కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలంగాణలో ప్రస్తుతం ప్రతి గ్రామంలో అనిశ్చితి ఉందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలకు అందిన ప్రతిఫలాలు ఇప్పుడు అందటం లేదు. గతంలో ఇచ్చిన కేసీఆర్ కిట్స్ సహా ఏ ప్రయోజనాలను ఈ ప్రభుత్వం జనాలకు అందకుండా చేస్తోంది. తెలంగాణ తెచ్చుకున్న తర్వాత కూడా ప్రత్యేక రాష్ట్ర ఫలితాలు ప్రజలకు అందని పరిస్థితికి బాధ్యులు ఎవరు? జాగృతి సంస్థగా మేము గతంలో మా పని మేము చేసుకున్నాం.. అప్పుడు కూడా కేసీఆర్ గారి ఫోటో పెట్టుకోలేదు. ఎప్పుడైతే నేను బీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచానో అప్పుడే పెద్ద సారు ఫోటోలను పెట్టామని మా పార్టీ అధినేతగా కేసీఆర్ ఫోటోలు కచ్చితంగా పెట్టుకున్నామని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కోసం, బీఆర్ఎస్ ప్రభుత్వం కోసం చిత్తశుద్ధితో పనిచేశామని, ప్రభుత్వ అందించిన ఫలాలు, ఫలితాలు కింది వరకు పోయేలా మా ప్రయత్నం చేశాం. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి నన్ను సస్పెండ్ చేశారని అన్నారు.

హైదరాబాద్ లో కూర్చొని సమస్యలు మాట్లాడటం కన్నా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలనుకుంటున్నామని, మన తెలంగాణలో మనసు, సానుభూతితో ఆలోచించే ఎంతో మేధావులు ఉన్నారు. మంచి, మంచి నాయకులు ఉన్నారు. వారందరినీ కలిసి మాట్లాడుతామని అన్నారు. ప్రతి జిల్లాలో అన్ని వర్గాల వారితో వారి అభిప్రాయాలు, ఆలోచనలను పంచుకుంటామని, దాని నుంచి ఒక నిర్ణయానికి వస్తామని అన్నారు.

తెలంగాణలో అమరుల ప్రాణా త్యాగాలు ఎందుకు జరిగాయో మనం అర్థం చేసుకోవాలని, తెలంగాణ తెచ్చుకొని అందరూ బాగుండాలనే వారు ప్రాణత్యాగం చేశారని వారి ఆశయమైన సామాజిక తెలంగాణ సాధించటమే నా యాత్ర లక్ష్యమని, కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేయనున్నామని ఐతే ఇది వారిని అగౌరవ పర్చినట్లు కాదని వారు లేకుండా తెలంగాణయే లేదని కానీ వారు ఒక పార్టీకి అధ్యక్షులుగా ఉన్నారని ఆ పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారని అన్నారు. ఆ పార్టీ ప్రాథమిక సభ్య త్వానికి కూడా నేను రిజైన్ చేశానని అన్నారు. అలాంటప్పుడు ఆయన ఫోటోతో నేను ముం దుకు వెళ్లటం నైతికంగా సరికాదు. నైతికంగా కరెక్ట్ కానీ దాన్ని నేను చేయలేనని చెట్టు పేరు చెప్పుకొని బతికే ఉద్దేశం లేదని ఆ చెట్టు నీడ లో ఉన్నంత వరకు దుర్మార్గుల బారి నుంచి చెట్టును కాపాడేందుకు ఎంతో ప్రయత్నం చేశానని, ఇప్పుడు నా దారి నేను వెతుక్కుంటున్నాని ఈ సమయంలో వారి ఫోటో పెట్టడం సరికాదని నేను నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే వరకు జాగృతిలో కేసీఆర్ ఫోటో పెట్టలేదని నైతికంగా కరెక్ట్ కాదనే భావనతోనే నేను కేసీఆర్ గారి ఫోటోను జనం బాట కార్యక్రమం పోస్టర్ లో పెట్టటం లేదు మీడి యాలో ఏవేవో కథనాలు ప్రచురిస్తున్నారు కాబట్టే దీనిపై నేనే వివరణ ఇస్తున్నానని కేసీఆర్ కూతురుగా పుట్టటం జన్మజన్మల అదృష్టం. ఆయనను అగౌరవ పర్చే పని చేయనని అన్నారు. మీడియా మిత్రులు కొంతమంది అత్యుత్సాహంతో కేసీఆర్ గారి ఫోటో లేదంటూ వార్తలు రాస్తున్నారని, జాగృతి మొదలైనప్పుడు జయశంకర్ సార్ గారి ఫోటో ను మాత్రమే పెట్టామని, నేను నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలిచిన తర్వాతనే కేసీఆర్ ఫోటోను జాగృతి కార్యక్రమాల్లో పెట్టుకున్నాం. ఇప్పుడు నేను ఆ పార్టీలో లేను అందుకే నా తరపున క్లారిటీ ఇస్తున్నా. నా దారిలో నేను వెళ్తుండగా ఆయన ఫోటో పెట్టుకోవటం నైతికంగా సరికాదని నేను జనం ఏం చెబుతారో వినాలనే జనం బాట కార్యక్రమం చేపడుతున్నా అని, తెలంగాణ వస్తే ఏం కావాలని ప్రజలు కోరుకున్నారో ఏం జరిగిందో, ఏం జరగాలని కోరుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటున్నాని అన్నారు.

కేసీఆర్ కి జాగృతి, బీఆర్ఎస్ రెండు కళ్ల మాదిరిగా ఉన్నామని, కానీ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశాక ఆయన ఫోటో పెట్టుకుంటే బీఆర్ఎస్ సోషల్ మీడియానే ట్రోల్ చేస్తుందని దారులు వేరైనప్పుడు ధైర్యం ఉండాలి. అందుకే నా దారిలో నేను వెళ్తున్నాని, రాజకీయంగా తెలంగాణలో స్పేస్ ఉందో లేదో నాకు తెలియదని ప్రజలనే అడిగి వారు చెప్పినట్లు వింటాం. అందుకే ప్రతి జిల్లాలో రెండు రోజులు ఉంటామన్నారు.

జాగృతిని స్ట్రాంగ్ చేసుకుంటామని గతంలో మా సంస్థ పటిష్టంగా ఉండేది, కేసీఆర్ చెప్పారని గతంలో కొన్ని కార్యక్రమాలు ఆపటం జరిగిందని, ఇప్పుడు సంస్థను పటిష్టం చేసుకుంటాం. మళ్లీ కొత్త వారిని రిక్రూట్ చేసుకుంటామని పార్టీనే వద్దనుకున్నాక ఎమ్మెల్సీ పదవి మీద వ్యామోహం లేదని నా రాజీనామా యాక్సెప్ట్ చేయకపోవటానికి కాంగ్రెస్ రాజకీయ మేమిటో తెలియటం లేదు. నా రాజీనామా ఆమోదిస్తే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమోదించడం లేదేమో. బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే మనకు రెండు బడ్జెట్ లలో 8 కొత్తలు కూడా ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ పార్టీ అన్ని చోట్ల వైఫల్యం చెందిందని, ప్రతిచోట పోరాటం చేయాల్సి వస్తోందని జాతీయ పార్టీలు వైఫల్యం చెందాయని బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసిందని అన్నారు. అందుకే ప్రజల దగ్గరకు వెళ్లి వాళ్లు చెప్పే మాటలు వినాలని నిర్ణయించుకున్నాని వాళ్లు చెప్పిన దాన్ని నుంచి ఏం చేయాలన్న ఒక సొలుష్యన్ వస్తుందని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాకు చిన్న విషయం. మాకు తెలంగాణ అనేదే పెద్ద అంశమని, అక్టోబర్ 25 నుంచి నిజామాబాద్ నుంచి జాగృతి జనం బాట ప్రారంభం కానుందని కవిత తెలిపారు.

# నేటి నుంచి మొక్కజొన్న పంట కొంటాం

(మొదటి పేజీ తరువాయి)

నియమించామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, హకా ఎమ్‌డీ చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

# 18న బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరపున రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు వస్తాయని చెప్పారు. ఇన్ని రకాలుగా మాటలు మార్చిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని మేము తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.బీసీ రిజర్వేషన్లకు మా పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇచ్చింది. తప్పులు చేసిన కాంగ్రెస్ పార్టీని కచ్చితంగా మా పార్టీ తరపున నిలదీస్తూనే ఉంటాము. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాల ప్రతి ప్రయత్నాన్ని మా పార్టీ తరపున సపోర్ట్ చేస్తాము. బీసీ రిజర్వేషన్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నన్ని రోజులు, ఆయన నాయకత్వంలో రానే రావు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదాకా నిలదీస్తూనే ఉంటాము. బీసీ డిక్లరేషన్లు ఇస్తామని చెప్పిన లక్ష కోట్ల బడ్జెట్ నుంచి మొదలుకొని బీసీ సబ్‌ప్లాన్ వంటి హామీలపైన నిలదీస్తూనే ఉంటాము. కాంగ్రెస్ తెచ్చిన 42 శాతం రిజర్వేషన్ కేవలం స్థానిక సంస్థల కోసం తీసుకువచ్చారు కానీ, విద్య, ఉపాధికి సంబంధించిన రిజర్వేషన్ల వాటా మిగిలిన అన్ని రంగాల్లో రావాల్సిన అవసరం ఉన్నది. కాంట్రాక్టులనుంచి మొదలుకొని అన్నింటికి సంబంధించిన వాటిలో 42 శాతం వాటా రావాలి అని బీసీ సమాజం డిమాండ్ చేయాలి అని కేటీఆర్ సూచించారు.

కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉన్నటువంటి కార్యక్రమాల అమలుపైన మనం నిలదీయాల్సిన అవసరం ఉన్నది. బీసీ సంఘాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటి పైన నిలదీయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. విద్య, ఉపాధి వంటి 42 శాతం రిజర్వేషన్ అన్ని రంగాల్లో గనక ఇస్తే లక్షల మంది బీసీ బిడ్డలకు లాభం జరుగుతుంది. బీసీ రిజర్వేషన్ల అంశంలో చిత్తశుద్ధి లేని శివపూజలాంటివి. రేవంత్ రెడ్డికి బీసీల అంశంలో ఎలాంటి చిత్తశుద్ధి లేదు. రాహుల్ గాంధీ, మోడీ ఇద్దరూ కలిసి ఒక్క మాట అంటే ఒక్క నిమిషంలో బీసీ రిజర్వేషన్ల అంశం తేలిపోతుంది. ఇండియా, ఎన్డీఏ రెండు కూటములు కలిస్తే బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే చట్టంగా మారుతుంది. పార్లమెంటులో బిల్లు పెడితే కచ్చితంగా అనుకూలంగా పాస్ అవుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దగ్గరికి తీసుకెళ్తే మేము వచ్చి మద్దతు ప్రకటిస్తాము.ప్రధానమంత్రి స్వయంగా ఓబీసీ కాబట్టి, ఆయనకి బీసీ రిజర్వేషన్ల పైన చిత్తశుద్ధి ఉంటే మంచిది. పార్లమెంటులో బిల్లు పెడితే కచ్చితంగా మా నలుగురు రాజ్యసభ ఎంపీలు ఓటు వేసేది మొదట బీఆర్ఎస్ పార్టీయే. తెలంగాణ ఉద్యమం మాదిరే, సమస్యను ఢిల్లీ దాకా తీసుకువెళ్లి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందాం. 18వ తేదీన బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు మా పార్టీ మద్దతు ఇస్తుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రూ.139 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఉప్పరపల్లి జనచైతన్య వెంచర్‌లో పార్కులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను బుధవారం హైడ్రా అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో ఆక్రమణలకు గురైన 4 పార్కులకు హైడ్రా విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1,2 పేరుతో హుడా అప్రూవల్‌తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం ఉదయం జేసీబీల సాయంతో కబ్జాలను తొలగించింది. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్డులను, రూమ్‌లను తొలగించారు. మూడు వేలు, వెయ్యి గజాలు, అయిదు వందల గజాల చొప్పున ఆక్రమించి నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేశారు. ఆక్రమణల తొలగింపు తర్వాత వెంటనే ఫెన్సింగ్ నిర్మాణ పనులను హైడ్రా చేపట్టింది. కబ్జాదారుల నుంచి పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- ‘ఆసియా-పసిఫిక్’ సదస్సుకు ఆహ్వానం

**బలగం టీవీ, హైదరాబాద్**

లైఫ్ సైన్స్ రంగంలో ప్రతిష్టాత్మకమైన ‘ఆసియా–పసిఫిక్’ సదస్సులో పాల్గొనెందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆహ్వానం అందింది. దేశంలో ఇప్పటి వరకు ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్‌లో జరిగే సదస్సులో పాల్గొనాలని ఆదేశ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ ఆహ్వానించారు. రెండేండ్లలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, తెలంగాణ సాధించిన ప్రగతిపై మంత్రి కీలకోపన్యాసం చేయనున్నారు.



# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం..



- **రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి..**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని,సాగుకు అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్నామని,రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. బుధవారం గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం పల్లిమక్తలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ ఎం. హరిత హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయం తోపాటుగా పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించాలని, దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ పై 200 యూనిట్ల గేదెలను రైతులకు ఇటీవల పంపిణీ చేశామని,పశు సంపదను కాపాడితే రైతుకు ఎంతో మేలు చేకూరుతుందని,ఆసక్తి, అర్హత ఉన్న రైతులకు పశువులు పంపిణీ చేస్తామని అన్నారు. మధ్య మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు పాడి పరిశ్రమ కింద ఉపాధి కల్పించేందుకు ఇటీవల ఆ శాఖ మంత్రిని కలిశామని, భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలకు సాగు నీరు అందించి పంటలను కాపాడమనిఅన్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ లో రెండు టీఎంసీల నీటిని నిలువ ఉంచామని, వచ్చే ఏడాది మూడు టీఎంసీల నీటిని నిలువ పెట్టనున్నామని,కాలువలు పూర్తి చేసి కోనరావుపేట మండలంలోని దాదాపు 10 గ్రామాలకు సాగునీటిని అందించామని గుర్తు చేశారు. మల్కపేట కు రూ. 12 కోట్ల బిల్లులు చెల్లించామని అన్నారు.రుద్రంగి కలికోట సూరమ్మ చెరువుకు రూ. 75 కోట్లు మంజూరు చేయగా, పనులు వేగంగా ముందుకు వెళు తున్నాయని,నాగారానికి రోడ్డు వేయించామని, పల్లిమక్తలో రూ. 1 కోటి 50 లక్షలతో రోడ్డు వేస్తున్నామని అన్నారు .

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.. -కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా వృద్ధి చెందాలని అన్నారు. వ్యవసాయంతో పాటుగా రైతులు అనుబంధంగా పశువులను పెంచుకోవడంతో ఆర్థికంగా మేలు చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వపరంగా అర్హులైన రైతులకు పశువులు, కోళ్ళ ఇతర జీవాలను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం టీకాలు పంపిణీ చేస్తుందని, పశువుల పెంపకందారులు తమ గ్రామాల్లో పశువైద్యాధికారులు నిర్వహించే శిబిరాలకు జీవాలను తీసుకెళ్లి టీకాలు వేయించాలనిఅన్నారు. పశువులు ఉండే పరిసరాలు నిత్యం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని దీంతో అవి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. పశువుల పెంపకం దారులు ఏటా అందజేసే టీకాలను జీవాలకు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, ఫ్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, తహసీల్దార్ ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం వరి కొనుగోలుకు సిద్ధం కావాలి

- **పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**బలగం టీవీ, పెద్దపల్లి**




పెద్దపల్లి జిల్లాలో వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు సంబంధిత అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ు "ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాస్తా ముందుగానే ప్రారంభించాలి. రైతులు పంట కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించాలి" అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా రైస్ మిల్లులకు తరలించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం**

జిల్లాలో నవంబర్ చివరి వరకు సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం. శ్రీకాంత్, డీఎంవో పీ. ప్రవీణ్ రెడ్డి, డీఆర్డీవో కాళిందిని, డీఏవో బీ. శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో రాతి కట్టడాలే నిర్మించాలి...

- **చారిత్ర కట్టడాలకు... నిలయం రాజన్న ఆలయం..**
- **భక్తుల మనోభావాలకు భంగం కలిగించవద్దు.**
- **శైలజా రామయ్యకు వినతి పత్రం అందించిన వేములవాడ బిఆర్ఎస్ పట్టణ శాఖ**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పుడు నిర్మించే నిర్మాణాలన్నీ రాతి కట్టడంలో ఉండాలని, సిమెంటు కాంక్రీటు కట్టడాలు ఉంటే ఆలయ చరిత్రకు భంగం అలగడమే కాకుండా, భక్తుల మనోభావాలకు భంగం కలిగించిన వారు అవుతారని వేములవాడ బీఆర్ఎస్ పట్టణ శాఖ పేర్కొంది. రాత్రి నిర్మాణంతోనే ఆలయ నిర్మాణ పనులు చేపట్టాలని బుధవారం హైదరాబాద్ లో దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్య వేములవాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ యాదాద్రి పుణ్యక్షేత్రం తరహాలోనే రాజన్న క్షేత్రంలో కృష్ణ శిలాలు, నల్ల రాతి వాడాలని, ఈ విధంగా కట్టడాలు నిర్మిస్తే వచ్చే భక్తులకు ఆలయంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని, భక్తి భావం పెంపొందుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీనివాస్



ఇటీవల మీడియాలో మాట్లాడుతూ 60 నుంచి 70 పిల్లర్లు సిమెంటు, కాంక్రీట్ తో కూడిన కట్టడాలు నిర్మిస్తామని అంటున్నారని,దీనివల్ల ఆలయ ప్రాసస్యం చరిత్ర దెబ్బ తినడమే కాకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారవుతారని అన్నారు. ఆలయంలో మాత్రం రాతి కట్టడాలు నిర్మించాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, గోలి మహేష్ తదితరులు ఉన్నారు.



# సీపీఆర్ పై అవగాహన తప్పనిసరి..

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసోసియేషన్)పై అందరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. సీపీఆర్ అవగాహన వారోత్స వాల సందర్భంగా తజిల్లా సమీకృత కార్యాల యాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం అన్ని శాఖల ఉన్నతాధికారులు, సిబ్బందికి సిపిఆర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్వయంగా సీపీఆర్ చేసి చూపించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందరికీ సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఒక వ్యక్తికి అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు అయిన పుడు వారికి సీపీఆర్ చేసినట్లయితే ప్రమాదం నుంచి కాపాడగలుగుతామన్నారు. ఇది లేకపోవడం వలన మరణాలు సంభవిస్తున్నాయని, సీపీఆర్ ట్రైనింగ్ సడన్ కార్డియాక్ అరెస్టు అయినప్పుడు ప్రథమ చికిత్స అందించాలని అన్నారు.

కార్డియాక్ అరెస్టు అయిన వారి వివరాలు 108 అంబులెన్స్ కు సమాచారమిస్తూ, వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తూ, ఊపిరి అందిస్తే ఒక నిండు ప్రాణాన్ని కాపాడొచ్చని అన్నారు. పలువురు ఉద్యోగులతో సీపీఆర్ విధానాన్ని తెలుసుకున్నారు. పలువురు ఉద్యోగుల అనుమానాలు నివృత్తి చేశారు. సీపీఆర్ అనేది సడన్ కార్డియాక్ అరెస్టు, స్పందనలో కీలకమైనదని, గుండె అకస్మాత్తుగా కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు, మెదడు ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడి వెంటనే సహాయం అందించకపోతే మెదడు దెబ్బతినడం లేదా మరణం నిమిషాల్లో సంభవిస్తుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత, వైద్యులు, జిల్లా అధికారులు, ఇత ర శాఖల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించాలి

- **వీకేఆర్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగ అవకాశం కల్పించాలని కోరుతూ మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్ జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ కర్ణాటక శాసనసభ్యులు మన్నే శ్రీనివాస్‌కు తనకు సంబంధించిన బయోడేటా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్ స్ యు ఐ మండల అధ్యక్షుడిగా మరియు నియోజకవర్గ అధ్యక్షుడిగా, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఎలక్షన్ లో పాల్గొన్ని విజయం సాధించి మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొంది పార్టీకి ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి అహర్నిశలు పాటుపడతూ 2019 స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోవడం జరిగిందన్నారు. పార్టీ కష్ట సమయంలో పార్టీ కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని ఎందరో నాయకులు మారిన నేను పార్టీ మారకుండా అప్పటి తెరాస ప్రభుత్వం పై వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేస్తే కేసులపై కోర్ట్ చుట్టూ తిరుగుతున్నానని ముఖ్యంగా తన తండ్రి అంతగిరి బాలపోచయ్య 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్ కార్యకర్త గా మొదలైన జీవితం మండల శాఖ అధ్యక్షుడిగా, బ్లాక్ స్థాయి అధ్యక్షులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ వివిధ పదువులలో పనిచేశారని గుర్తు చేశారు. పార్టీ గుర్తించి సిరిసిల్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా కొండగట్టు దేవస్థానం బోర్డు మెంబెర్ గా అవకాశం ఇచ్చిందని. పార్టీ మారకుండా ఇప్పటి వరకి పార్టీలో కొనసాగుతున్నామని నా అభ్యర్థిత్వన్ని పరిగణలోకి తీసుకోని నాకు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా అవకాశం కల్పించాలని విచ్చేసినా ఏఐసీసీ అబ్జర్వర్ కర్ణాటక శాసనసభ్యులు మన్నే శ్రీనివాస్, మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రభుత్వ విప్ రాజన్న సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ కు బయోడేటా ఫామ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**బలగం టీవీ, కాల్వశ్రీరాంపూర్**

కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం ఉషన్నపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది రోగులకు ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేశారు. తరువాత డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల కంటే ఎక్కువగా ఉండే జ్వరాలను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. వైరల్ ఫీవర్ల కారణంగా శరీరంలోని ఇతర అవయవాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, సొంతంగా మందులు వాడకుండా తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ "గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించాం" అన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# తొలి నేపథ్య గాయని రావు బాలసరస్వతి దేవి కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు చిత్రసీమ తొలి తరం నేపథ్య గాయనిగా ప్రసిద్ధి చెందిన రావు బాలసరస్వతి దేవి బుధవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె వయసు 97 సంవత్సరాలు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న బాలసరస్వతి దేవి, మణికొండలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



1928 ఆగస్టు 29న జన్మించిన బాలసరస్వతి దేవి, ఆరేళ్ల వయసు నుంచే పాటలు పాడడం ప్రారంభించారు. ఆకాశవాణి కార్యక్రమాల ద్వారా తెలుగు శ్రోతలకు ఆమె స్వరం ఎంతో సుపరిచితమైంది. 1936లో విడుదలైన 'సతీ అనసూయ' చిత్రంలో తొలిసారిగా పాట పాడి, తెలుగు సినిమా తొలి నేపథ్య గాయనిగా చరిత్రలో నిలిచారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీతో సహా పలు భాషల్లో 2000కు పైగా పాటలు ఆలపించి, 'లలిత సంగీత సామ్రాజ్ఞి'గా పేరుగాంచారు. రావు బాలసరస్వతి దేవి మరణం పట్ల సినీ ప్రముఖులు, సంగీతాభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె మరణంతో తెలుగు సినీ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయం ముగిసిందని పలువురు పేర్కొన్నారు.

# వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో రోనాల్డో కొత్త చరిత్ర

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రసిద్ధ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో మరోసారి చరిత్ర సృష్టించాడు. వరల్డ్‌కప్ 2026 క్వాలిఫయింగ్ టోర్నీల్లో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. పోర్చుగల్ తరపున ఇప్పటివరకు 41 గోల్స్‌తో కొత్త రికార్డు నెలకొల్పాడు. లిస్బన్‌లోని ఇస్టాడియో జోష్ అల్వలేడ్ స్టేడియంలో హంగేరీతో జరిగిన మ్యాచ్‌లో రోనాల్డో రెండు గోల్స్ సాధించాడు. ఈ మ్యాచ్ 2-2 తేడాతో డ్రాగా ముగిసింది. గత రికార్డు గ్వాటెమాలా ఆటగాడు కార్లో రూయిజ్ (39 గోల్స్) పేరిట ఉండగా, దాన్ని రోనాల్డో అధిగమించాడు. వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో 40 గోల్స్ మైలురాయి దాటిన తొలి ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోనాల్డో చరిత్రలో నిలిచాడు. అయితే పోర్చుగల్ జట్టు ఇంకా 2026 ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేదు. రాబోయే నవంబర్ 14న ఐర్లాండ్‌తో జరగనున్న మ్యాచ్‌లో విజయం సాధిస్తే, ఆ అర్హతను సాధించే అవకాశముంది.

# మహాభారత్ నటుడు పంకజ్ ధీర్ కన్నుమూత



**బలగం టీవీ, హైదరాబాద్**

హిందీ టెలివిజన్ ప్రపంచంలో ప్రముఖ నటుడిగా గుర్తింపు పొందిన పంకజ్ ధీర్ ఇకలేరు. బీఆర్ చోప్రా రూపొందించిన ప్రఖ్యాత టెలివిజన్ సీరియల్ 'మహాభారత్' లో కర్ణుడి పాత్రతో దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు గాంచిన ఆయన, 68 ఏళ్ల వయసులో కన్నుమూశారు. వివరాల ప్రకారం, కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న పంకజ్ ధీర్, చికిత్స పొందుతున్నప్పటికీ, పరిస్థితి విషమించి బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణాన్ని ప్రొడ్యూసర్ అశోక్ పండిట్ ధృవీకరించారు. పంకజ్ ధీర్ 1980%-%90 దశకాల్లో టెలివిజన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'మహాభారత్'లో కర్ణుడి పాత్రతో పాటు, ప్రసిద్ధ ఫ్యాంటసీ డ్రామా 'చంద్రకాంత' లో శివదత్తు చక్రవర్తి పాత్రలో ఆయన నటన విశేషంగా గుర్తింపు పొందింది.సినీ, టెలివిజన్ రంగాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. పంకజ్ ధీర్ అంత్యక్రియలు ఈ రోజు మధ్యాహ్నం న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు.



## ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా

**బలగం టీవీ, హైదరాబాద్**

వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా, 24 గంటల వ్యవధిలోనే ఆస్ట్రేలియా పర్యటనకు బయలుదేరింది. మూడు వన్డేలు, ఐదు టీ-20ల సిరీస్‌ల కోసం శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్లు బుధవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కాయి. ముందుగా వన్డే సిరీస్ జరగనుండగా, అక్టోబర్ 19న పెర్త్ వేదికగా తొలి మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి వెటరన్ బ్యాటర్లు కూడా జట్టుతో కలసి వెళ్లారు. విమానాశ్రయంలో కోహ్లీ, రోహిత్‌లను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారితో సెల్ఫీలు దిగేందుకు, ఆటోగ్రాఫ్‌లు పొందేందుకు అభిమానులు ఆత్రుతగా పోటీ పడ్డారు. ఆటగాళ్లు కూడా ఓపికగా స్పందించి అభిమానులతో కలిసి ఫోటోలు దిగారు.

## ఛార్మీతో నాకున్నది స్నేహం మాత్రమే: పూరీ జగన్నాథ్

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ డైనమిక్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ మరియు నటి-నిర్మాత ఛార్మీ కౌర్ మధ్య ఉన్న సంబంధంపై సోషల్ మీడియాలో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్న పుకార్లకు పూరీ మరోసారి తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. తమ మధ్య ఉన్నది కేవలం స్నేహబంధమేనని, రొమాంటిక్ సంబంధమంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఈ విషయంపై స్పందించిన పూరీ జగన్నాథ్ మాట్లాడుతూ "ఛార్మీ నాకు ఆమె వయసు 13 ఏళ్ల నుంచే తెలుసు. గత 20 ఏళ్లుగా మేమిద్దరం మంచి స్నేహితులుగా ఉన్నాం. కలిసి ఎన్నో సినిమాల్లో పనిచేశాం. కానీ మా మధ్య ఎలాంటి రొమాంటిక్ వ్యవహారం లేదు," అని తెలిపారు. సోషల్ మీడియాలో యువత కారణంగానే ఇలాంటి పుకార్లు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని పూరీ అభిప్రాయపడ్డారు. పుకార్ల వెనుక ఉన్న కారణాన్ని వివరించుతూ ఆయన చెప్పారు %-"ప్రస్తుతం ఛార్మీ పెళ్లి చేసుకోలేదు. ఆమె సింగిల్‌గా ఉండటమే ఇలాంటి ఊహాగానాలకు కారణమవుతోంది. ఒకవేళ ఆమె వయసు 50 ఏళ్లు ఉండి, వివాహితగా ఉంటే ఎవరూ ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకునే వారు కాదు," అని వివరించారు. తమ మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని, అది ఎప్పటికీ శాశ్వతంగా కొనసాగుతుందని పూరీ స్పష్టం చేశారు.ఈ వ్యాఖ్యలతో పూరీ-ఛార్మీ బంధంపై వస్తున్న పుకార్లకు మరోసారి చెక్ పడినట్టయింది.

# 'సలార్' రీ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్. రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 23న అభిమానులకు అదిరిపోయే ట్రీట్ రాబోతోంది. ప్రభాస్ నటించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' ను మళ్లీ రీ రిలీజ్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి హొంబలే ఫిలిమ్స్ నుండి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా గత సంవత్సరం డిసెంబర్ 22, 2023న విడుదలై భారీ విజయాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా హిట్ టాక్ అందుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.700 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది. ఇప్పుడు అదే సినిమాను ప్రభాస్ బర్త్‌డే స్పెషల్‌గా రీ రిలీజ్ చేయబోతున్నట్లు సమాచారం. అంతేకాదు, 'సలార్'తో పాటు ప్రభాస్ నటించిన 'ఈశ్వర్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'పౌర్ణమి' వంటి పాపులర్ సినిమాలను కూడా థియేటర్లలో మళ్లీ ప్రదర్శించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అభిమానులు తమ ఫేవరెట్ స్టార్‌ను పెద్ద తెరపై మరల చూడబోతుండటంతో సోషల్ మీడియాలో ప్రభాస్ బర్త్‌డే ట్రెండ్ ఇప్పటికే మొదలైంది.

# 'సంబరాల ఏటిగట్టు' నుంచి సాయిధరమ్ తేజ్ పవర్‌ఫుల్ లుక్!




**బలగం టీవీ, హైదరాబాద్**

'విరూపాక్ష' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత టాలీవుడ్ హీరో సాయి ధరమ్ తేజ్ శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కె.పీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సాయి తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రబృందం ఈ రోజు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో సాయి తేజ్ 'బాలీ' అనే శక్తివంతమైన పాత్రలో కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నాడు. ఈ చిత్రం సుమారు రూ.125 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతుండగా, కథానాయికగా ఐశ్వర్య లక్ష్మీ నటిస్తున్నారు. అలాగే జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.దర్శకుడు రోహిత్ కె.పీ మాట్లాడుతూ "సాయి తేజ్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా, ఇంతవరకు ఆయన చేయని రీతిలో ఉంటుంది. ఇది ఆయన కెరీర్‌లో మరో మైలురాయి అవుతుంది," అని తెలిపారు. 'సంబరాల ఏటిగట్టు' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'దే దే ప్యార్ దే 2' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్, హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దే దే ప్యార్ దే' 2019లో భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. అదే విజయాన్ని మరలా కొనసాగిస్తూ ఈ చిత్రానికి సీక్వెల్ 'దే దే ప్యార్ దే 2' రూపుదిద్దుకుంది. నవంబర్ 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ సందర్భంగా తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ సీక్వెల్‌లో కీలక ఆకర్షణగా నటుడు ఆర్. మాధవన్ చేరారు. ఆయేషా తండ్రి పాత్రలో కనిపించే ఆయన, అల్లుడిగా తన వయసున్న వ్యక్తిని అంగీకరించకపోవడంతో కథలో హాస్యభరిత డ్రామా మొదలవుతుంది. ఈ రొమాంటిక్ కామెడీకి అన్షుల్ శర్మ దర్శకత్వం వహించగా, కథను లవ్ రంజన్ అందించారు. ట్రైలర్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం, ఈ ఏడాది చివరి త్రైమాసికంలో ప్రేక్షకులకు నవ్వులు పంచే ప్రేమకథగా నిలవనుంది.

## 19న జెమినీ టీవీలో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ 'కన్నప్ప'

**బలగం టీవీ, హైదరాబాద్**




డైనమిక్ హీరో మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన డివైన్ యాక్షన్ డ్రామా 'కన్నప్ప' థియేటర్లలో ఘనవిజయం సాధించిన తర్వాత ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 19న మధ్యాహ్నం 12 గంటలకు జెమినీ టీవీలో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం కానుంది. ఈ సినిమాను 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ మరియు అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై డా. ఎం. మోహన్ బాబు భారీ స్థాయిలో నిర్మించగా, ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. థియేటర్లలో భక్తి, యాక్షన్, గ్రాఫిక్స్ మిశ్రమంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం, ఓటీటీలో కూడా మంచి విజయం సాధించింది. దీపావళి సందర్భంగా టీవీ ప్రీమియర్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "థియేటర్ మ్యాజిక్ ఇప్పుడు టీవీపై రిపీట్ కానుంది" అంటూ మేకర్స్ సంతోషం వ్యక్తం చేశారు. అనేక భాషల్లో రూపొందిన ఈ చిత్రాన్ని సన్ నెట్‌వర్క్ చానళ్లలో ఒకేసారి ప్రసారం చేయడం విశేషం.